క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న బ్యాంక్ అధికారులు

లింగపాలెం : ధర్మాజీగూడెం ఏపీ గ్రామీణ బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన పథకంలో కలరాయునగూడెం గ్రామానికి చెందిన మోరంపూడి రాంబాబు ఒక ఏడాదికి సంబంధించి రూ.436 ఇన్సూరెన్స్ చెసుకున్నాడు. రాంబాబు ఇటీవల గుండెపోటుతో మరణించటంతో గ్రామీణ బ్యాంక్ రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఏలూరు రీజనల్ మేనేజర్ యు.శ్రీదేవి, ధర్మాజీగూడెం గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కొండ్రెడ్డి రాజేష్, గ్రామపెద్దలు గారపాటి బుజ్జియ్య, పూర్ణచంద్రరరావు చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు వి.బాలకృష్ణ, నాగాచారి పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కుక్కునూరు: మండలంలోని పాములేరు బ్రిడ్జి వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వేలేరు గ్రామానికి చెందిన వాంకుడోత్ సాయికిరణ్ ఐదు లీటర్ల సారా తరలిస్తూ పట్టుబడినట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. సాయికిరణ్ నుంచి తన ద్విచక్ర వాహనం, సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.

గురుకులంలో సీట్లు పొందిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం రాజు

ద్వారకాతిరుమల: మండలంలోని శరభాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముగ్గురు గురుకుల పాఠశాలలో సీట్లు పొందారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలగాల రాజు తెలిపారు. నాలుగో తరగతి పూర్తి చేసిన దాసరి లోకేష్, కాకరాల ఎనోష్, పెట్ల శ్రీజన్‌లు పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరేందుకు సీట్లు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈఓలు విద్యార్థుల కృషిని ప్రశంసించారు.

రైతులను దోచుకుంటున్న దళారులు

ఏలూరు (టూటౌన్): ధాన్యంలో తేమశాతం 20 శాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమని, కానీ ఆ ఫలాలు రైతులకు చేరకుండా దళారులు రైతులని అడ్డగోలుగా దోచుకుంటున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆరోపించారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఏనిర్వహించిన కిసాన్ మోర్చా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో బీజేపీ కిసాన్ మోర్చాని క్షేత్రస్థాయిలో బలపరచాలని అన్నారు. ప్రతి గ్రామానా అధ్యక్షుల్ని నియమించాలని సూచించారు. కీర్తి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లల్లో దళారుల అరాచకాలని నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, పెన్మెత్స రామచంద్ర రాజు, పాకలపాటి రవిరాజు, రాయంకుల చక్రదరరావు, ఉండవల్లి వెంకట్రావు, మేకల కృష్ణ దేవరాయలు పాల్గొన్నారు.

అనాథ బాలల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ

ఏలూరు (టూటౌన్): బాలలంతా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సంబంధిత అధికారులతో అనాథ బాలలకు ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, న్యాయ సాధికారిత అనే అంశంపై స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో బుల్లి కృష్ణ మాట్లాడారు. జిల్లాలో అనాథ, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన, గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి వారికి గుర్తింపు కార్డు/ఆధార్ కార్డు మంజూరు చేయించాలన్నారు. ఈ ప్రక్రియకు న్యాయ, రెవెన్యూ, వైద్య శాఖలు, పానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో కమిటీ (సాధి) ఏర్పాటు చేశామన్నారు. అధికారులు న్యాయ సేవాధికార సంస్థ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియలో భాగం కావాలని సూచించారు.

నేడు తప్పిపోయిన పిల్లల దినోత్సవం

జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా ఆదివారం సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని బుల్లి కృష్ణ సూచించారు. ప్రస్తుత సమాజంలో బాలల అక్రమ రవాణా పెరిగిపోయిందని, దీనిని అరికట్టడానికి జిల్లా న్యాయశాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

మూసివేత దిశగా శ్రీ వేంకటేశ్వర కాలేజీ

- ఈ ఏడాది అడ్మిషన్లు నిలుపుదల
- కామవరపుకోట పరిసర ప్రాంత విద్యార్థుల ఆందోళన



కామవరపుకోటలో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల



కళాశాల వద్ద అడ్మిషన్ కోసం ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

కామవరపుకోట: ఆ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 41 సంవత్సరాలగా కొన్ని వేల మందిని పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఆ కళాశాల నేడు నిర్వహణ భారంతో మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ సంవత్సరం అడ్మిషన్లు పూర్తిగా నిలిపివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలను ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ ద్వారా 1984 సంవత్సరంలో కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. కళాశాల ప్రారంభించిన నాటి నుంచి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు నిబద్ధతతో క్రమశిక్షణతో పని చేశారు. దీంతో ఈ కళాశాలకు కామవరపుకోట మండలంలోపాటు జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి లక్కవరం, టి.నరసాపురం మండలం బొర్రంపాలెం, తిరుమలదేవిపేట, జగ్గవరం, లింగపాలెం మండలం రంగాపురం, ములుగులంపాడు, కె.గోకవరం తదితర 25 గ్రామాలకు చెందిన విద్యార్థులు వచ్చి చదువుకొని వెళ్లేవారు. ఇక్కడ చదివిన విద్యార్థులు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, తహసీల్దార్లుగా, ఆర్డీఓలుగా, ఎంపీడీఓలుగా, లెక్చరర్లుగా ఇంకా అనేక శాఖలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న కళాశాలను మూసివేస్తే ఈ ప్రాంత పేద విద్యార్థులు నష్టపోతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐఓ యోహాను విచారణకు రాగా, పిల్లల అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు కళాశాల వద్ద ధర్నా కూడా చేశారు. కళాశాలను మూసివేసే ఆలోచన మానుకుని, పిల్లల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాలను కొనసాగించాలి



కళాశాల మూసివేస్తే ఈ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య దూరమవుతుంది. ఫీజులు చెల్లించి దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోనే స్తోమత లేక మానేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కళాశాలను కొనసాగించాలి.

– సాయినా కనకరాజు, సొసైటీ మాజీ చైర్మన్, కామవరపుకోట

కళాశాలలో అడ్మిషన్ కల్పించాలి



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 530 మార్కులతో పాసయ్యాను. మా తల్లిదండ్రులు నన్ను దూర ప్రాంతాలకు పంపించి చదివించే ఆర్థిక స్తోమత లేదు. కళాశాలకు అడ్మిషన్ కోసం వస్తే వెళ్లిపొమ్మన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం అడ్మిషన్ కల్పించాలి.

– భైరవ ముక్కోటి, విద్యార్థి, కామవరపుకోట

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



భద్రంకు నివాళులర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని కామయ్యకుంటకు చెందిన వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు కుంజా వీరభద్రం ఇటీవల అకాల మృతి చెందారు. శనివారం కామయ్యకుంటలో భద్రం ఇంటికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి అభివృద్ధికి భద్రం ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. భద్రం మరణం పార్టీకి తీరనిలోటని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

బుట్టాయగూడెం: మండలంలోని బూసరాజుపల్లి బాలికల కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న బాలికలకు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఈ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బుట్టాయగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మోసం కన్నప్పరాజు, తెల్లం శ్రీను, పూసం శ్రీను, కుంజా ముత్యాలరావు, తెల్లం భీమరాజుతోపాటు మరికొందరు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తెల్లం లక్ష్మణరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోదెం ముక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: మక్కినవారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని బండివారిగూడెం ఫీడర్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పను లు, కొత్త లైన్లు ఏర్పాటుకు ఆదివారం ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

గిరిజన విద్యా సంస్థల్లో బదిలీల కౌన్సెలింగ్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో సిబ్బంది బదిలీల ప్రక్రియను జూన్ 2వ తేదీలోపు పూర్తి చేయనున్నట్టు ఐడీడీఏ పీఓ కె.రాములు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు ఆదేశాల మేరకు మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఈ బదిలీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తిచేసిన వారు తప్పనిసరిగా బదిలీకి అర్హులన్నారు. పరస్పర బదిలీ, బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. బదిలీకి దరఖాస్తు చేసుకునేవారు ప్రస్తుతం పనిచేసే చోట రెండేళ్లు పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తును ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు, కేఆర్‌పురంలో సమర్పించాలని అన్నారు. సీనియారిటీ జాబితాను 28వ తేదీ సాయంత్రానికి ఐటీడీఏ కేఆర్‌పురం నోటీస్ బోర్డులో, డీవైఈఓ వాట్సాప్ గ్రూప్‌లో ప్రదర్శిస్తామని చెప్పారు.

మత విద్వేష కుట్రలను ప్రతిఘటిద్దాం



పంగిడిగూడెంలో కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

ద్వారకాతిరుమల: ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటూ ప్రారంభించిన యుద్ధాన్ని, ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకుండానే అర్ధాంతరంగా ముగించి, దేశ ప్రజల గౌరవాన్ని మోదీ ప్రభుత్వం అమెరికాకు తాకట్టు పెట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ లింగరాజు ఆరోపించారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామంలో సమైక్యతా వారోత్సవాల్లో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సీపీఎం నాయకులు ఆ పార్టీ కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ చేస్తున్న కుటిల ప్రయత్నాలను ప్రజలందరూ సమైక్యంగా ప్రతిగటించాలన్నారు. భారతీయులతో పాటు కాశీర్మర్ ప్రజలు సైతం ఉగ్రవాద దాడిని ముక్త కంఠంతో వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఇలా ఐక్యంగా ఉండడం మతోన్మాద బీజేపీ శక్తులకు ఇష్టం లేక, ఉగ్రవాద దాడులను రెండు మతాల మధ్య దాడులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని వివరించారు. ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదని, మానవత్వం లేకపోవడమే దానికి కారణమని అన్నారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగానే ఎదుర్కోగలమని, మతాల మధ్య విద్వేషాలతో ఎదుర్కోవడం సాధ్యం కాదని తెలిపారు. బీజేపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో ఒక మతానికి వ్యతిరేకంగా విష ప్రచారం చేయడాన్ని ప్రజలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, నాయకులు మానుకొండ వీర్రాజు తదితరులున్నారు.

భారీ వర్షం.. క్షేత్ర పరిసరాలు బురదమయం



తూర్పు ప్రాంతంలో మురుగు నీటిని ఊడ్చుతున్న సిబ్బంది



దీపారాధన మండప ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం ఉదయం కురిసిన భారీ వర్షం కారణంగా ఆలయ పరిసరాలు బురదమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఆ వైపుగా రాకపోకలు సాగించే భక్తులు ఇబ్బంది పడకూడదని దేవస్థానం అధికారులు ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. జంటగోపురాల సమీప ప్రాంతంతో పాటు, దీపారాధన మండప పరిసరాలు, పందిళ్లలో నిలిచిన బురదను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. బురద నీటిని బయటకు ఊడ్చారు. బురద నీటిలోని పీచు మ్యాట్లను తీసి శుభ్రం చేశారు.

చికెన్ మార్కెట్‌ను తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఉన్న పంచాయతీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కోళ్లఫారమ్ చికెన్ మార్కెట్ వ్యర్థాలు డ్రెయినేజీలో కలవడం వల్ల రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న దళితపేటలోని దళితులు అనారోగ్యం పాలవుతున్నారని కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ దారా శిఖామణి, మైనారిటీ సెల్ నాయకుడు ఎ.ఏసుపాదం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చికెన్ మార్కెట్‌ను తొలగించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే ఈ కోళ్ల మార్కెట్ వల్ల డ్రెయినేజీ ద్వారా వస్తోన్న దుర్గంధంతో రాజీవ్‌నగర్ కాలనీ దళితులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చెప్పినప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడని ఆరోపించారు. రెండు నెలల క్రితం ఎంపీడీఓ కె.జ్యోతికి వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదని వాపోయారు. చికెన్ మార్కెట్ షాపును తొలగిస్తామని హామీ ఇచ్చిన అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

కోకోకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఉత్పత్తి చేసిన కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకుండా కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే కంపెనీలు, ట్రేడర్లు కోకో గింజలను తక్కువ ధరకు కొనుగోలు చేశారని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో ధర రూ.880 ఉన్నప్పటికీ కంపెనీలు కేవలం రూ.450 ధరకు కొనడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రభుత్వం వాస్తవాలను పరిశీలించకుండా తమకు అనుకూలమైన రైతులతో మాట్లాడి ప్రస్తుతం ఉన్న పంట కొనుగోలు చేయాలని చెబుతూ రూ.450 కంపెనీలు ఇస్తాయని, రూ.50 ప్రభుత్వం చెల్లిస్తుందని ఏకపక్షంగా చెప్పటం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు చెప్పినట్టు కోకో పంట మద్దతు ధర కోసం ప్రత్యేక చట్టం తెచ్చే వరకు ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో రైతులకు సరైన ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కంపెనీలు కొన్న ధరకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధరకు ఉన్న వ్యత్యాసాన్ని కంపెనీలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విదేశాల నుండి వచ్చే కోకో దిగుమతులు తక్షణం నిలిపివేయాలని కోరారు. సమస్య పరిష్కరించకుంటే పోరాటం చేస్తామన్నారు.

నిల్వ కూల్ డ్రింకుల గుర్తింపు



దిప్పకాయలపాడులో నిల్వ కూల్‌డ్రింకులు



రచ్చబండ నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు గ్రామంలో నిల్వ చేసి ఉంచిన కూల్‌డ్రింకులను విక్రయించడం శనివారం వివాదాస్పదమైంది. ఈనెల 23న వర్జీనియా పొగాకు వేలం కేంద్రం అధికారులు గ్రామానికి విచ్చేశారు. వీరికి రైతులు దిప్పకాయలపాడులోని కొయ్యలగూడెం రోడ్డులో ఉన్న ఒక షాపు నుంచి కూల్ డ్రింక్స్ తీసుకొచ్చి ఇచ్చారు. డ్రింక్ తాగిన ఒకరి ఆరోజు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా హాస్పిటల్‌కి తరలించారు. ఇందుకు కూల్ డ్రింక్ తాగడమేనని వైద్యులు నిర్ధారించారు. దీంతో షాపు వద్దకు వెళ్లి రైతులు మిగిలిన స్టాకు బయటకు తీయించగా కూల్‌డ్రింకులు 2022వ సంవత్సరానికి చెందినవని తెలిసింది. దీంతో గ్రామంలోని ముఖ్య రైతులు రచ్చబండ నిర్వహించి వ్యాపారిని తీవ్రంగా మందలించారు. చివరకు వ్యాపారి క్షమాపణలు తెలపడంతో రైతులు శాంతించారు.

జామాయిల్ సాగుతో ముప్పే

- పంట సాగుకు అనుకూల భూముల్లో మొక్కల పెంపకం
- విలీన మండలాల్లో అధికంగా సాగు



కుక్కునూరులో సాగుకు అనుకూల భూమల్లో పెంచిన జామాయిల్ తోటలు

కుక్కునూరు: పరిస్థితుల ప్రభావం, సంపాదనపై వ్యామోహం తదితర కారణాలతో మనిషి వేస్తోన్న అడుగులు ప్రకృతిపై తీవ్ర ప్రభావం చూపడమే కాక, భవిష్యత్తు తరాలను అంధకారంలోకి నెడుతున్నాయి. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో జామాయిల్ మొక్కల పెంపకమే అందుకు ఉదాహరణ. బంజర భూములు, సాగుకు అనువుకాని భూముల్లో పెంచాల్సిన జామాయిల్ మొక్కలను సాగుకు అనుకూలంగా ఉన్న భూముల్లో వేలాది ఎకరాల్లో పెంచుతున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండడం ఓ సారి పెట్టుబడి పెడితే పదేళ్ల వరకు పంటను దిగుబడి చేసుకునే అవకాశం ఉండడం తదితర కారణాలతో విలీన మండలాల్లో కూడా జామాయిల్ సాగును అధికంగా చేపడుతున్నారు.

భూసారానికి ముప్పు : విలీన మండలాల్లో వేలాది ఎకరాల్లో పలువురు రైతులు జామాయిల్ సాగు చేస్తున్నారు. ఇందుకు దగ్గర్లోనే సారపాక పేపర్ ఫ్యాక్టరీ కూడా ఉండడం మరో కారణం. జామాయిల్ వల్ల భూగర్భ జలాలు అడుగంటడం, భూసారం దెబ్బతినడంతోపాటు జామాయిల్ మొక్కల నుంచి రాలిపడిన ఆకులతో వచ్చే రసాయనాల వల్ల వేరే మొక్కలు కూడా పెరిగే అవకాశం ఉండదని పలు అధ్యాయనాల్లో వెల్లడైనట్టు తెలుస్తోంది.

పరిహారం చెల్లించిన భూముల్లో సాగు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పోలవరం ప్రాజెక్ట్ నిమిత్తం సేకరించిన భూములను నిర్వాసితులు పునరావాస కాలనీలకు వెళ్లే వరకు సాగు చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అయితే గోదావరి వరద ప్రభావం, తెగుళ్లు, గిట్టుబాటు ధర లేకపోవడం తదితర కారణాలతో పంట నష్టపోతున్న రైతులు పరిహారం చెల్లించిన భూముల్లో జామాయిల్ సాగుకు కౌలుకు ఇస్తున్నట్టు చెబుతున్నారు. జామాయిల్ తోటలు రైతులకు కాసులు కురిపిస్తున్నప్పటికీ భవిష్యత్తు తరాలకు అది పెనుప్రమాదంగా మారే పరిస్థితి లేకపోలేదని పలువురు ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాలు అండుగంటే ప్రమాదం



జామాయిల్ మొక్కలు భూగర్భంలోని చాలా లోతు నుంచి నీటిని పీల్చుకుంటాయి. ఈ మొక్కలతో భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం పొంచి ఉంది. రైతులు జామాయిల్‌కు బదులు వ్యవసాయ, ఇతర ఉద్యాన పంటల సాగు వైపు దృష్టి సారిస్తే మంచిది.

– ఆర్ బాలాజీ, వ్యవసాయశాఖ మండల అధికారి, కుక్కునూరు

కరోనా భయం వద్దు.. జాగ్రత్తలే ముద్దు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కడప, విశాఖపట్నంలోనూ ఇప్పటికే కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఏలూరు జీజీహెచ్‌లో వైద్యులు ముందుస్తు చర్యలకు ఉపక్రమించారు. 20 బెడ్లతో కూడిన వార్డును సిద్ధం చేశారు. కరోనా సోకిన వారికి శ్వాసకోశ వ్యాధులు తీవ్రమైతే ఆక్సిజన్ బెడ్లు కూడా ఏర్పాటు చేశారు. తొలుత ఏలూరు జీజీహెచ్ భవనంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయం సమీపంలో ఒక వార్డు సిద్ధంగా ఉంది.

అందుబాటులో కరోనా పరీక్షల కిట్లు

ఏలూరు జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌ను సిద్ధం చేశారు. కరోనా లక్షణాలతో ఎవరైనా హాస్పిటల్‌కు వస్తే వారికి కరోనా టెస్టులు చేసేందుకు ల్యాబ్‌ను రెడీ చేశారు. టెక్నీషియన్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 500 కరోనా పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచారు. పాజిటివ్ కేసులు అధికంగా ఉంటే వాటికి అనుగుణంగా పరీక్షల కిట్లను తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. సాధారణ టెస్టులతో పాటు, వీఆర్‌డీఎల్ పరీక్షలు చేసేందుకు ల్యాబ్ యంత్ర పరికరాలను సిద్ధం చేశారు.

ఆందోళన వద్దు

కోవిడ్ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జాగ్రత్తలు పాటించాలి. కరోనా లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలి. మాస్క్ ధరించాలి. జనం అధికంగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం, జలుబు, ఒంటి నొప్పులు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలి. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడేవారు, వృద్ధులు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఏలూరు